# అభివృద్ధికి ఆకర్షితులై.. బీఆర్ఎస్‌లో చేరికలు

**ఎమ్మెల్యేలు జాజాల సురేందర్, షిండే, జడ్పీ మాజీ చైర్మన్ రాజు సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్న ఇతర పార్టీల నాయకులు**



ఎమ్మెల్యే సురేందర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన రామారెడ్డి కాంగ్రెస్ ఎంపీటీసీ భాగ్యలక్ష్మి



గాలీపూర్‌లో యువకుడికి గులాబీ కండువా కప్పుతున్న జడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు

గాంధారి/ రామారెడ్డి, అక్టోబర్ 29: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితులై చాలా మంది బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారు. గాంధారి మండలంలోని గండివేట్ గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ పెద్ద కాశీరాం, ఏఎంసీ మాజీ డైరెక్టర్ అలీం ఆషూతోపాటు బీజేపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు దాదాపు 50 మంది ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ సమక్షంలో ఆదివారం బీఆర్ ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సురేందర్ వారికి గులాబీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జాజాల సురేందర్‌ను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని పార్టీలో చేరిన వారు అన్నారు. కార్యక్రమంలో గండివేట్ సర్పంచ్ అబ్దుల్‌ఫారూక్‌తోపాటు ఉప సర్పంచ్ ఇంద్రాగౌడ్, ఎంపీటీసీ బూస సారికా శ్రీనివాస్, పార్టీలో చేరిన వార్డు మెంబర్ హన్మంతు, పాలకుర్తి కాశీరాం, హాజీ, చాకలి కాశీరాం తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ నూనె భాగ్యలక్ష్మి.. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆమెకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మండలంలోని ఉప్పల్‌వాయి, పోసానిపేట్, ఇసన్నపల్లి గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు, యూత్ నాయకులు పలువురు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రంగు రవీందర్ గౌడ్, ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి, రైతు బంధు సమితి మండల కన్వీనర్ గుర్జాల నారాయణరెడ్డి, సర్పంచ్ దండ బోయిన సంజీవ్, ఉప సర్పంచ్ పోతునూరి ప్రసాద్ గుప్తా, రైతు బంధు సమితి జిల్లా డైరెక్టర్ కాసర్ల రాజేందర్, ఎంపీటీసీలు తుపాకుల రజితా రాజేందర్ గౌడ్, మొగుళ్ల ప్రవీణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

***పదేండ్లలో ఎంతో అభివృద్ధి..***

పెద్ద కొడప్‌గల్, అక్టోబర్ 29: మండలంలోని కాస్లాబాద్ గ్రామంలో అదివారం ఎంపీపీ ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో ఆకుల సతీశ్‌యాదవ్‌తోపాటు 110 మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్మే హన్మంత్‌షిండే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్మే మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో తనతో ఉంటూ తన విజయానికి కృషిచేసిన ఆకుల సతీశ్ అనివార్య కారణాలతో కొంత కాలంగా దూరంగా ఉన్నాడని అన్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. పదేండ్లలో కాస్లాబాద్ గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశానని చెప్పారు. కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రి చేయాలన్నారు. సోమవారం జుక్కల్ చౌరస్తాలో నిర్వహించే సీఎం కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ మెంబర్ జాఫర్‌షా, సొసైటీ చైర్మన్ హన్మంత్ రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు తిర్మల్ రెడ్డి, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

***జడ్పీ మాజీ చైర్మన్ రాజు సమక్షంలో..***

నిజాంసాగర్ మండలం గాలీపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, యువకులు సుమారు 20 మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి జడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం తెల్గాపూర్‌లో ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. నేడు జుక్కల్ చౌరస్తాలో నిర్వహించే సీఎం కేసీఆర్ ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ వాజిద్‌అలీ, నాయకులు, సర్పంచులు లక్మారెడ్డి, లక్ష్మీనారాయణ, చందర్, అంకితా శ్రీనివాస్, నారాయణ, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జాజాల సురేందర్‌కు యాచారం తండాల గిరిజనుల మద్దతు

సదాశివనగర్, అక్టోబర్ 29: ఎల్లారెడ్డి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జాజాల సురేందర్‌కు ఉమ్మడి యాచారం( ఐదు గ్రామ పంచాయతీల) గిరిజన నాయకులు రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఉమ్మడి యాచారం గ్రామ పంచాయతీని ఐదు గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశారని తెలిపారు. 20 ఏండ్లుగా ఎదురు చూస్తున్న పోడు భూములకు ఎమ్మెల్యే సురేందర్ పట్టాలను పంపిణీ చేసినట్లు చెప్పారు. కారు గుర్తుకు ఓటు చేసి సురేందర్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తామని తెలిపారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, పార్టీ యాచారం గ్రామ శాఖ అధ్యక్షుడు మాగ్యానాయక్, ఎంపీపీ గైని అనసూయా రమేశ్, జడ్పీటీసీ నర్సింహులు, మాజీ జడ్పీటీసీ రాజేశ్వర్ రావు, జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు మొయినొద్దీన్, రైతు బంధు సమితి మండల కన్వీనర్ భూంరెడ్డి, జిల్లా డైరెక్టర్ గడీల భాస్కర్, సర్పంచులు లతా రమేశ్, సురేందర్ నాయక్, గిరిజన నాయకులు శంకర్ నాయక్, సురేందర్ నాయక్, లచ్చీరాం నాయక్, పీర్‌సింగ్ నాయక్, శక్రూనాయక్, గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఎం ప్రజా ఆశీర్వాద సభకు తరలిరావాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు దుర్గారెడ్డి

పిట్లం/నిజాంసాగర్, అక్టోబర్ 29: జుక్కల్ చౌరస్తా వద్ద నేడు సోమవారం నిర్వహించనున్న సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిట్లం ఎంపీపీ కవిత, నిజాంసాగర్ మండల నాయకుడు దుర్గారెడ్డి అన్నారు. పిట్లం, నిజాంసాగర్‌లో వారు ఆదివారం వేర్వేరుగా నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడారు. సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశాల్లో పార్టీ పిట్లం మండల అధ్యక్షుడు వాసరి రమేశ్, జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి నిజాంసాగర్ వైస్ ఎంపీపీ మనోహర్, నాయకులు విఠల్‌రెడ్డి, బాబూసేట్, నారాయణ, బ్రహ్మానంద్‌రెడ్డి, సుభాష్, ప్రకాశ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## చుక్కాపూర్‌లో భక్తుల సందడి

మాచారెడ్డి, అక్టోబర్ 29: మండలంలోని చుక్కాపూర్ అటవీ ప్రాంతంలో కొలువైన శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. జిల్లాతోపాటు ఇతర జిల్లాల నుంచి భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకొని ఒడిబియ్యం, పట్టెనామాలు, కోరెమీసాలు, కండ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నూతన వాహనాలకు ప్రత్యేక పూజలు చేయించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టినట్లు ఆలయ కమిటీ చైర్మన్ శనిగరం కమలాకర్‌రెడ్డి, ఈవో శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పరాంధామాచార్యులు, నర్సింహాచార్యులు, సంజీవాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## తలమడ్ల రెడ్డి సంఘ కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన తలమడ్ల రెడ్డి సంఘం కార్యవర్గ సభ్యులు

రాజంపేట్, అక్టోబర్ 29 : మండలంలోని తలమడ్ల గ్రామంలో రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సావుసాని సంపత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా సంజీవ రెడ్డి, సెక్రటరీగా రాజేశ్వర్‌రెడ్డి, కోశాధికారిగా సావుసాని సాయిరెడ్డి, సలహాదారులుగా రాజిరెడ్డి, శివకుమార్, రవీందర్ రెడ్డి, శ్రావణ్ రెడ్డి, అల్లకొండ రాజిరెడ్డిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సావుసాని సంపత్‌రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

# రక్తదానం చేసి ప్రాణాలను కాపాడవచ్చు



రక్తదాన శిబిరంలో పాల్గొన్న విప్ గంపగోవర్ధన్

కామారెడ్డి, అక్టోబర్ 29 : తలసేమియా చిన్నారుల కోసం స్మైల్ ఫర్ మెసేజ్, కామారెడ్డి రక్తదాతల సమూహం ఆధ్వర్యంలో ఆదివారం ఎస్ఆర్ గార్డెన్‌లో మెగా రక్తదానం శిబిరాన్ని నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరానికి ప్రభుత్వ విప్, కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం చేయడంతో ఒకరి ప్రాణాలను కాపాడవచ్చని అన్నారు. తలసేమియా చిన్నారుల కోసం 248పైగా యూనిట్ల రక్తాన్ని సేకరించడం అభినందనీయమని అన్నారు. రక్తదానం చేసిన రక్తదాతలను, కృషి చేసిన నిర్వాహకులకు అభినందించారు. చిన్నారులకు 15 రోజులకు ఒకసారి ఒక యూనిట్ రక్తం అవసరం ఉంటుందని తెలిపారు.

కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబుద్దీన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్, ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ బాలు, రక్తదాతల సమూహ అధ్యక్షుడు వేద ప్రకాశ్, రమణ, జమీల్ తదితరులు పాల్గొన్నారు.

## అత్యవసర సేవల పరిధిలోకి వచ్చేలా పోస్టల్ బ్యాలట్ సౌకర్యం

**జిల్లా ఎన్నికల అధికారి జితేశ్ వీ పాటిల్**

కామారెడ్డి, అక్టోబర్ 29 : అత్యవసర సేవల పరిధిలోకి వచ్చే పలు విభాగాలకు ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలట్ సౌకర్యం కల్పించిందని జిల్లా ఎన్నికల అధికారి జితేశ్ వీ పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిర్ పోర్ట్, రైల్వే, భారత ఆహార సంస్థ, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియో, విద్యుత్ శాఖ, వైద్య, కుటుంబ సంక్షేమం, రవాణ, పౌర సరఫరాలు, బీఎస్ఎన్ఎల్, మీడియా, అగ్నిమాపక విభాగాల్లో విధుల్లో నిమగ్నమై ఓటు హక్కును వినియోగించుకోలేని వారు మాత్రమే దరఖాస్తులను ఫారం 12 (డి)లో తమ పూర్తి వివరాలతో సంబంధిత రిటర్నింగ్ అధికారులకు నవంబర్ 3 నుంచి 7వ తేదీలోగా సమర్పించాలని సూచించారు. దరఖాస్తు ఫారాలను రిటర్నింగ్, నోడల్ అధికారుల నుంచి పొందవచ్చని, ఎన్నికల సంఘం పోర్టల్ నుంచి కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ఓటింగ్ కేంద్రాలు, సమయ వివరాలు దరఖాస్తులోని మొబైల్ నంబర్లకు లేదా బూత్ లెవల్ అధికారుల ద్వారా తెలియజేస్తామని అన్నారు.

దరఖాస్తు చేసుకున్న వారు మాత్రమే ఈ సదుపాయాన్ని వినియోగించుకుంటే బాగుంటుందని కలెక్టర్ సూచించారు.

## బాన్సువాడలో సీఎం ప్రజా ఆశీర్వాద సభకు ముమ్మర ఏర్పాట్లు

బాన్సువాడ, అక్టోబర్ 29 : బాన్సువాడలోని వీక్లి మార్కెట్ ఆవరణలో సోమవారం మధ్యాహ్నం నిర్వహించనున్న సీఎం కేసీఆర్ ఆశీర్వాద సభకు డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి ఆధ్వర్యం లో ముమ్మరంగా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఇబ్బందులు లేకుండా స్పీకర్ పోచారం శ్రీనివాస రెడ్డి సూచనల మేరకు ఎండ ఉండకుండా టెంట్లు, తాగునీరు, మహిళలకు టాయిలెట్స్ ఏర్పాట్లు సభాస్థలి వద్ద చేపడుతున్నారు. బాన్సువాడలో నిర్వహించే ఆశీర్వాద సభలో సుమారు లక్ష మంది సభకు రానున్న సందర్భంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. వచ్చే వాహనాల కోసం ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలు రెండుచోట్ల ఏర్పాట్లు చేశారు. సభా స్థలి వద్ద భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ పరిశీలించారు.



బాన్సువాడలో సిద్ధమైన సభా వేదిక